# ఒయాసిస్సు

నందివెంటి రామకృష్ణ



**మా** ఊరిలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్యాంపు ఉంది. ఆ క్యాంపులో ఉద్యోగులకు కేటాయించబడ్డ క్వార్టర్సు ఉన్నాయి. ఆ క్వార్టర్లన్నిటిలో ఉద్యోగులూ ఉన్నారు.

ఆ డేటు సంవత్సరం నాకు గుర్తు లేవు కాని, ఇక్కడే ఉండి ఇంటర్ మీడియట్ చదువుతున్న నేను ఎక్కడో వున్న నాన్నగారికి 'నాకు జ్వరం వచ్చిందని, వెంటనే అమ్మను పంపించవలసినదిగా' టెలిగ్రాం ఇవ్వడానికి క్యాంపు పక్క కాలనీలో ఉన్న పోస్టాఫీసుకు బయలుదేరాను.

అప్పటికే ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకుని ఇప్పుడో మరి కాసేపటికో వర్షం కురిసేలా ఉంది. నాకేమో నూట రెండు డిగ్రీల జ్వరం ఉంది. వర్షం రాకముందే పోస్టాఫీసుకు వెళ్లక పోతానా అని బయలుదేరిన నాకు క్యాంపు దాటక ముందే చిరు జల్లులు ఎదురై క్షణాల్లోనే పెనుగాలులు తోడై ఆ చిరుజల్లులు జడి వానగా మారాయి.

జ్వరంతో తడిస్తే ఏమౌతుందేమోనన్న నా ఆలోచనలు వర్షానికి తడుస్తూ కలవరింపులుగా మారాయి. ఆశ్రయం కోసం అన్వేషిస్తున్న నా కనులకు రోడ్డు కిరువైపులా ఉన్న క్వార్టర్స్ తలుపులు మూసుకుంటున్న శబ్దాలు సమాధానాలయ్యాయి.

ఎవ్వరూ నీకాశ్రయమివ్వకపోయినా నేనిస్తా నంటూ కారు చీకటిలో చిరు దివ్వెలా కాస్తంత దూరంలో రోడ్డు పక్కనే ఉన్న ఒక పెద్ద చెట్టు దర్శనమిచ్చింది. పరుగు పరుగున దాన్ని చేరుకుని లావుగా ఉన్న మొదలును ఆనుకుని ఒద్దికగా నిలుచున్నాను.

అప్పటికే పూర్తిగా తడిసిపోయాను. చలితో వళ్లు వణికి పోతోంది. మరేదైనా షెల్టర్ దొరుకుతుందేమోనని చుట్టూ చూసాను. పదడుగుల దూరంలో ఒక పాకలాంటి గుడిసె కనిపించింది. గుడిసె ముందున్న చిన్న పందిరి కింద నిలబడి ఎవరో నన్ను పిలుస్తున్నట్లుగా

అనిపించింది.

పరుగులాంటి నడకతో పందిరికిందికి చేరుకున్నాను. లోపలికి రండి అంటూ నా చేయి పట్టుకుని పాకలోకి తీసుకువెళ్ళింది. దాదాపు నా వయసులోనే ఉన్న అమ్మాయి. అయ్యో! మీ చేయి చాలా వేడిగా ఉంది జ్వరం వచ్చిందా ఏమిటి "అంటూ తడుచుకోవడానికి టవల్" ఇచ్చింది. ఒక మూలగా ఉన్న కిరోసిన్ స్టౌ వెలిగించి నా ముందు పెట్టింది. దానిపై అంతకు ముందే తయారు చేసి చల్లబడిన టీ ఉన్న పాత్రను ఉంచి "గాలి తగలకుండా కాస్త స్టౌ పక్కనే కూర్చోండి టీ వేడయ్యేలోగా నేను మీకు జ్వరం టాబ్లెట్ తెస్తాను" అంటూ వారిస్తున్నా వినకుండా జడివానలోకి జారుకుంది.

పాకలో మరెవరూ ఉన్న జాడ కనిపించలేదు. ఎప్పుడు వచ్చిందో ఏమో "అరే, మీరింకా తడిసిన బట్టల్లోనే ఉన్నారా!" అంటూ పాకలో ఒక మూలగా ఉన్న చెక్క పెట్టెలోనించి లుంగీ ఒక చొక్కా తీసి "మీ బట్టలు మార్చుకుని ఇవి వేసుకోండి" అంటూ నా చేతికి అందించింది. ఆ చొరవకు ఆశ్చర్యపడేంత తీరికా ఓపికా లేని నేను గాలికి రెపరెపలాడుతున్న దీపపు వెలుగులో బట్టలు మార్చుకున్నాను.

ఒక గ్లాసుతో నీళ్ళు తీసుకుని వచ్చి టాబ్లెట్ చేతికిచ్చింది. నేను టాబ్లెట్ వేసుకునేలోగా వేడిగా ఉన్న టీ కప్పు చేతికిచ్చింది. పాకలోని దండెంపై ఉన్న దుప్పటి తీసుకువచ్చి "టీ తాగి ఈ దుప్పటి కప్పుకుని వర్షం తగ్గేవరకూ ఆ మంచంపై పడుకోండి" అంటూ పక్కనే ఉన్న నులకమంచాన్ని చూపించింది.

జోరున కురుస్తున్న వాన, హోరున వీస్తున్న గాలి, జ్వరంతో కాలిపోతున్న ఒళ్ళు, వణికిస్తున్న చలి, నులక మంచంపై దుప్పటి కప్పుకుని ఎప్పుడు నిద్రలోకి జారి పోయానో నాకే తెలియదు.

కళ్ళు తెరిచేసరికి జ్వరం తగ్గిందో లేదో తెలియదు కాని వర్షం మాత్రం తగ్గింది. ఉతికి ఆరవేసినట్లుగా ఉన్న నా బట్టలు ఎదురుగా దండేనికి వేళాడుతూ కనిపించాయి. ఒక మూలగా ఉన్న మంచంపై చలికి ముడుచుకుని పడుకుంది ఆ అమ్మాయి. లేచి బట్టలు మార్చుకుని వెళ్ళడానికి సిద్ధమయ్యాను.

అలికిడికి మెళకువ వచ్చి కళ్ళు నులుముకుంటూ దగ్గరగా వచ్చింది. "ఏమిటి నాకు చెప్పకుండానే వెళ్ళాలనుకుంటున్నారా"అని అడిగింది. "అదేం కాదు ఇప్పుడే లేచి బట్టలు మార్చుకున్నాను. నీకు చెప్పి వెళ్ళిపోదామని సిద్ధపడుతున్నాను" బదులిచ్చాను.

"ఇంతకూ జ్వరం తగ్గిందా? అన్నట్లు మరచిపోయాను. రాత్రి మీ బట్టలు పిండి వేసే ముందు మీ షర్ట్ జేబులో ఉన్న డబ్బులు తీసి పక్కన పెట్టాను తీసుకోండి" అంటూ నా చేతికిచ్చింది. డెబ్భైరెండు రూపాయలు.

ఇరవై రూపాయలు తీసి "రాత్రి మీరు నాకు తెచ్చిన టాబ్లెట్ల డబ్బులు" అంటూ ఇవ్వబోయాను. ఆమె నా కళ్ళలోకి సూటిగా చూస్తూ "చూడండి, నాకు తోడబుట్టిన వారెవరూ లేరు. ఒక వేళ నాకు మీలాంటి అన్నయ్యే ఉంటే ఇలాగే చేసి ఉండకపోయేదానినా! నాకా తృప్తిని మిగలనివ్వండి" అంటూ సున్నితంగా తిరస్కరించింది.

పాకలో నుంచి బయలుదేరి పోస్టాఫీసుకు వెళ్ళి టెలిగ్రాం ఇచ్చాను. హాస్పిటల్‌కు వెళ్ళి పరీక్ష చేయించుకుని వచ్చిన దారినే తిరిగి ఇంటి ముఖం పట్టాను.

దారిలో పాకముందు జనమంతా గుమికూడి ఉండటం చూసి ఏమిటా అని ఆశ్చర్యపోయాను. ఆ పాకలో ఉన్న భార్యా భర్తలు పొలం పనికి వెళ్ళి పిడుగు పాటుకు బలయ్యారని తెలిసింది.

"మరి ఆ అమ్మాయి?" మనసులో అనుకున్న మాట పెదవిదాటింది. "ఆ అమ్మాయికి తల్లితండ్రులు లేరు. దూరపు బంధువు కావడంతో తమకు పిల్లలు కూడా లేక పోవడంతో ఆ అమ్మాయిని కన్న బిడ్డలా ఆదుకుంటున్నారు ఆ భార్యా భర్తలు. పాపం.... ఆ అమ్మాయి ఏం పాపం చేసుకుందో మళ్ళీ అనాధగా మారింది" నిట్టూర్చాడు నా పక్కనే ఉన్న పెద్ద మనిషి.

జనాన్ని తోసుకుని కాస్త ముందుకు వెళ్ళాను ఆ రెండు శవాలపై పడి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఆ సోదరి శోకదేవతలా దర్శనమిచ్చింది.

తోడబుట్టిన వాళ్ళే కాదు కన్నవాళ్ళూ, నా అన్న వాళ్ళూ లేని తన దయనీయ పరిస్థితికి నా హృదయం ద్రవించింది. "కానీ ఏం చేయగలను?"

శోక తప్త హృదయంతో తనను పెంచుకుంటున్న తల్లితండ్రుల శవయాత్ర వెంట సాగుతున్న ఆ సోదరిని అదే చివరిసారి చూడడం.

ఆ రోజే వచ్చిన మా అమ్మ జ్వరంతో ఉన్న నన్ను మూడు రోజుల వరకు ఇల్లు కదలనివ్వలేదు. నాలుగవ రోజు ఓపిక చేసుకుని పాక దగ్గరికి వెళ్ళిన నాకు పాకలో ఎవ్వరూ కనిపించలేదు.

ఆ సోదరిని గురించిన జాడ మరి తెలియరాలేదు - కానీ తన జ్ఞాపకం మాత్రం నాలో మాసి పోలేదు. ❁


# ప్రియదత్త

**సకుటుంబ సచిత్రవార పత్రిక**

**6 నెలల చందా : పోస్టు ద్వారా రు. 200/-**

**3 నెలల చందా : పోస్టు ద్వారా రు. 100/-**

**సంవత్సర చందా : ఏజెంట్ ద్వారా రు. 364/-**

**6 నెలల చందా : ఏజెంట్ ద్వారా రు. 182/-**

**3 నెలల చందా : ఏజెంట్ ద్వారా రు. 91/-**

**మీ చందా మొత్తాన్ని మనియార్డర్ ద్వారా కానీ, క్రాస్ చేసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో కానీ చెన్నయ్‌లో చెల్లించేలా "ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్" పేర 103/1, లజ్ చర్చి రోడ్, మైలాపూర్, చెన్నయ్ - 600 004 చిరునామాకి పంపకోరుతున్నాము. చెన్నయ్‌లో ఉన్న వారు చెక్కు ద్వారా పంపవచ్చు.**

**- మేనేజర్**